# హిమబిందు
## బాపిరాజు నవలకు విమర్శనాత్మక సమీక్ష
## "పద్మజా భూషణ్"

**పద్మాకర్ 1965-66లో హిందీ అనువాదము ప్రచురితము**

# హిమబిందు

శ్రీ అడవి బాపిరాజు తెలుగు దేశమునకు భావ కవిత్వమిచ్చిన బంగారు పంట వంగ సాహిత్యానికి రవీంద్రుడు ఎంత వైవిధ్యమైన కళామూర్తో, తెలుగు సాహిత్యానికి బాపిరాజు అంత. ఆయన కవి, కథకుడు, గేయకారుడు, గాయకుడు, శిల్పి, చిత్రలేఖకుడు. ఆయన వ్రాసిన ప్రతి పంక్తిలోనూ యీ వైవిధ్యమూర్తే మనకు గోచరిస్తాడు.

బాపిరాజు ఆరాధ్యదేవత శశిబాల. ఈ శశి బాలపైన ఆయన వ్రాసిన గేయాలు భావ కవితా సరస్వతాకి ముత్యాల మాల. ఆయన చిత్ర లేఖకుడై విశ్వనాధవారి కిన్నెరసానికి రూప సౌందర్యమును అందించినవాడు. పత్రికా సంపాదకుడై తన నవలలను, కథలను ధారవాహికంగా తెలుగు దేశానికి అందించడమే కాక, తెలుగు సాహిత్యానికే ఎంతో సేవ చేసినవాడు.

బాపిరాజు భావన సులలితము, గంభీరమూ. సెలయేరులా నడచిపోయే యీయన పద విన్యాసము, అతి సుకుమారము, సౌష్టవము అయిన యీయన పాత్ర పోషణము, సన్నివేశములలోని తెలుగు తనము – బాపిరాజు గారి నవలలకు, కథలకు, గేయాలకు ఒక ప్రత్యేకమైన ప్రతిపత్తిని సంపాదించిపెట్టాయి.

తెలుగు జీవితంలోని ఆనందదాయకమైన ప్రతి భావనకు కావ్యరూపమిచ్చినవాడు బాపిరాజు. సంక్రాంతి పండుగకు తెలుగు పల్లెసీమల్లో నిత్యమూ సాక్షాత్కరించే బసవన్నల మీది పాట యీయన తెలుగు తనానికి నిదర్శనము. ఈయనకు తెలుగు దేశమన్నా, తెలుగు చరిత్ర అన్నా విపరీతమైన అభిమానము. ఈయన వ్రాసిన నవలలకు, కథలకు తెలుగు దేశమే కథాస్థానము. తెలుగు వీరులకథలే వానికి ఇతివృత్తములు.

బాపిరాజుగారి నవలలలో నాలుగు ప్రధానమైనవి: హిమబిందు, గోనగన్నా రెడ్డి, నారాయణరావు, కోనంగి. ఇవి నాలుగూ తెలుగు వారి కథలను ఇతివృత్తముగా స్వీకరించినవే. హిమబిందు ఆంధ్రసాతవాహనుల కథ. గోనగన్నారెడ్డి కాకతీయులకు సంబంధించిన చరిత్రాత్మక నవల. శ్రీశ్రీ రుద్రదేవి ఆంధ్ర సామ్రాజ్ఞిగా వుండగా ఆమెకు దక్షిణ హస్తంగా వుండి వర్ధమానపురం రాజధానిగా పశ్చిమాంధ్రభూమిని ఏలుతూ వుండిన మహా మాండలిక ప్రభువు గోనగన్నారెడ్డిని గురించిన కథ యిది. "నారాయణరావు" తెలుగు జమిందారుల

ఇండ్లలోని కథ. ఆ జమీందారుల ఆచారములు, మనస్తత్వములు, సంఘర్షణలు ఇందు వివరంగా వర్ణించబడ్డాయి. ఇది ఆంధ్రవిశ్వవిద్యాలయము వారిచే బహుమతినందిన నవల. ఇక "కోనంగి" ఇటీవలి జాతీయోద్యమమును గురించినది. ఇందు తెలుగు దేశమున జరిగిన ఉద్యమములలో తెలుగు వీరులు సాధించిన విజయములను గురించిన కథ.

ఇవీకాక బాపిరాజు వ్రాసిన నవలికలలో రాగమాలిక, జాజిమల్లి, నరుడు అన్నవి ముఖ్యమైనవి. ఏభైకి పైగా కథలను కూడా యాయన వ్రాసినాడు. "సంధ్యానృత్యము", వంటి కథలు అతిసుకుమార భావనాస్పదములై చదువరులను రంజింపచేసిన వనుట అతిశయోక్తి కాదు.

ఈ రచనలన్నింటిలోను మనకు కన్పించేది బాపిరాజు గారి వైవిధ్యమైన వ్యక్తిత్వము. ఆయన తెలుగు తనము, ఆయనకు లలిత కళల యందున్న అమితమైన ఆసక్తి.

ఈయన వ్రాసిన నవలలలో సాధారణంగా "నారాయణరావు"నకు పాఠములు ఎక్కువ. కాని సాహిత్య విమర్శనము దృష్ట్యా "హిమబిందు"నకు ప్రథమ తాంబూలము యీయవలెను.

"హిమబిందు" దాదాపు 350 పేజీల బృహన్నవల. ఇది నాలుగు భాగములుగా విభజింపబడ్డది. వందకు పైగా అధ్యాయములు ఉన్నవి.

ఇది ఆంధ్రసాతవాహనులను గురించిన కథ. చారిత్రక నవలను రూపొందించడానికి రచయితలు ప్రత్యేకమైన కృషిని చేయవలసి వుంది కథాసంవిధానంలో, భాషలో, పాత్రల కల్పనలోను, పోషణలోను, ఏనాటి చరిత్రకు సంబంధించిన కథను రచయిత గ్రహించెనో, ఆనాటికి సంబంధించిన విషయాలను జోడింపవలెను. ఇట్లు అన్ని విషయముల చారిత్రక నవలను ఉత్తమోత్తమంగా బాపిరాజు చేశారు. దీనికి నిదర్శనం హిమబిందు నవల.

బౌద్ధ శకము 453లో ధాన్యకటకము రాజధానిగా ఉన్న ఆంధ్రసామ్రాజ్యమునకు మహారాజైన శ్రీముఖ సాతవాహనుడు ఏ విధముగా పాటలీ పుత్రాన్ని జయించి జంబూద్వీప చక్రవర్తిత్వమును సాధించినాడో నిరూపించే నవల యిది. ఇంతవరకు మాత్రమే యిది చారిత్రక సత్యము. దీనికి సరియైన సాంఘిక, రాజకీయ పరిస్థితులను కల్పించుటలో బాపిరాజుగారు చూపిన ప్రజ్ఞ అనన్య సామాన్యమైనది.

శ్రీముఖ సాతవాహనుడు రాజ్యమునకు వచ్చిన పందొమ్మిది సంవత్సరములకు – అనగా బౌద్ధ శకము 472వ వత్సరమున – మహారాజుల జన్మదినోత్సవములతో కథారంభము చేయబడినది. అప్పటికే శ్రీముఖుల కుమారుడు శ్రీకృష్ణ సాతవాహనుడు మహారాజ బిరుదమునంది ప్రతిష్ఠాన నగరమును పాలించుచున్నాడు. ఆ తరువాత మహారాజును మాయాదేవి, శాంతిశ్రీదేవి యున్న కుమార్తెలు. చివరివాడైన మంజు శ్రీకుమారుడు

కొన్ని మానములు క్రితమే చోరులచే తస్కరింపబడుటచే రాజకుటుంబము కొంత విచార సముద్రమున మునిగినది.

మహారాజుల జన్మదినోత్సవములనగానే ఎన్నో పందెములు, మహోత్సవములు జరుగును. పందెములలో గెలుపొందిన వారికి మహారాజు బహుమానములు ఇచ్చెను. ఇట్టి పందెములలో శకట చోదక పరీక్షలు ముఖ్యమైనవి. ప్రతిసంవత్సరము వలెనే ఇప్పుడును చారుగుప్తులవారి శకటములు పందెములో పాల్గొనుచున్నవి. వారి శకటమునకు చోదకుడు – వారి మేనల్లుడు, మహారాజుల సైన్యములో ఉపసైన్యాధికారి అయిన సమర్తి శాతవాహనుడు.

కాని తుదకు విజయలక్ష్మి సువర్ణశ్రీ అను యువశిల్పిని వరించింది. సువర్ణశ్రీ రాజశిల్పి అగు ధర్మనంది తనయుడు. వ్యాయామచార్యులైన సోమదత్తుని శిష్యుడు. చారుగుప్తులవారికి, వారి కుమార్తె హిమబిందూదేవికి సువర్ణశ్రీ యన్న కొంచెము కోపము వచ్చినది. కాని సువర్ణశ్రీ మిక్కిలి అందగాడు. ఉత్తముడైన శిల్పి. హిమబిందు ఆకర్షితురాలై తన సర్వస్వమును ఆ యువకునకు అర్పించినది. సువర్ణశ్రీ హిమబిందు తోటిదే లోకమైనది.

ఇది ఇట్లుండగా, రాజ్యమును కూలద్రోయుటకు కొందరు పన్నాగములను పన్నుచున్నట్లు మహారాజులకు తెలియవచ్చినది. సాతవాహనులు బౌద్దులు. వైదిక మతానుయాయులు కొందరు పరరాజుల సహాయమున సాతవాహనులను కూలద్రోసి వైదిక రాజ్యమును స్థాపింపవలెనని కుట్ర సాగించుచుండిరి. స్థౌలతిష్య మహర్షులకు దీనితో సంబంధ మున్నదని రాజోద్యోగుల అనుమానము. మంజుశ్రీ రాకుమారుడు తస్కరింపబడుటకు, యీ కుట్రకు కూడా సంబంధమున్నదని వేగు.

ఈ కుట్రను గూర్చి మహారాజ మందిరమున ఆలోచించుచున్న వారిలో ఆర్యచారుగుప్తుడు ఒకడు. అతడు భారతవణిక్సార్వ భౌముడు. మహారాజునకు కుడిభుజము. ఆంధ్రసామ్రాజ్యమునకు ఆతడు ఆది శేషువు వంటివాడు. ఆతడు తన కుమార్తె హిమబిందును మహారాజ కుమారుడు, భావిమహారాజు అయిన శ్రీకృష్ణ సాతవాహనులకి ఇచ్చి ఉద్వాహము చేయవలెనని కలలు కనుచున్నాడు. కాని ఆమెకు మేనత్త కొమరుడైన సమదర్శి కూడా ఆమెను వివాహమాడ ఉవ్విళ్ళూరుచుండెను.

మరి యొకవైపు స్థౌలతిష్యులు విషబాల యను విషకన్యను సృష్టించి ఆమెను శ్రీకృష్ణ సాతవాహనునిపైకి పంపుటకు యత్నించుచున్నారు. ఆయన యీ విషయమున చాణక్యనీతిని ప్రదర్శించుచు పైకి మహారాజులకు హితులైనట్లు నటించుచు, లోలోన కుట్రలు పన్నుటలో నిమగ్నులైనారు.

పుళిందులొక వైపు, మాగధులొక వైపు, తమ పై యుద్ధ సన్నద్ధులగుచున్నారని తెలియగనే మంత్రి, సైన్యాధిపతులతోను, వర్తక చక్రవర్తి చారుగుప్తునితోను సంప్రదించి తామె సైన్యమును విభజించి పుళిందుల నణచుటకు, ఉజ్జయిని ముట్టడించుటకు పోవుచు దారిలో ‘భరకచ్ఛము’ అన్న వీడరేవుని స్వాధీనపరుచు కొనుటకు వేరుగా సైన్యములను పంపుటకు మహారాజు శ్రీముఖుడు నిశ్చయించెను. శ్రీకృష్ణ సాతవాహన యువరాజు

ఒక సైన్యమునకు నాయకుడు.

విషబాలను స్త్రీ పురుష సంబంధమైన భావములకతీతముగ స్థూలతిష్యులు పెంచినను, ఆమెకు తన పరిసరములను గమనించుసరికి ప్రకృతి సహజమైన ఆ భావము మెల్లగ అంకురించినది. తాను విషబాలగా పెరుగుట ఆమెకే భయమైనది.

చారుగుప్తుల వారు కూడ మహారాజులతో యుద్ధమునకు పోవుటకు ఆయత్తమైంది. ఆయన బయలుదేరుచు – తన మనోభావమును కుమార్తెకు చెప్పినాడు. ఏనాటికైననను ఆమె మహారాజ్ఞి కావలయునని, అందులకు మహారాజులు అంగీకరించినారని – హిమబిందు మూర్ఛిల్లినది. తన్ను విడిచి ఉండుటచే ఆమె అట్లగుచున్నదని చారుగుప్తులు సమాధానపడిరి.

హిమబిందు తన తండ్రి మనోరథమును ప్రియునకు చెప్పుటతో సువర్ణశ్రీ నిలువున నీరైనాడు. తను మనసునంతను కూడ గట్టుకుని తాను హిమబిందును మహారాజ్ఞి చేయుటకే నిశ్చయించి తన ప్రేమను త్యాగము చేయుటకియ్యకొనెను.

శ్రీకృష్ణ సాతవాహనుడు వేటనెపమున బయలుదేరి, రానురాను తన బలమును కూర్చుకొని ఉజ్జయినిని ఒక ప్రక్కనుండి ముట్టడించవలెనని రాజాజ్ఞ. ఇట్లు వచ్చుట స్థూల తిష్యులెరుగుదురు. విషబాలను మంత్రించి శ్రీకృష్ణుడు వచ్చుదారిలో ఆమెను ఉంచినాడు. అది ప్రయోగవిధానము. ఆమె విషయములు యువరాజును ముందునకు సాగనీయవు. ఆతడు యీమెను కనుగొనును. దాపునకు వచ్చును. మరణించుట కదిచక్కని మార్గము.

అనుకున్నట్లే యువరాజు ఆమెను చూచినాడు. ఆమె కన్నులలోని వింతకాంతి అతనిని ముందునకు పోనీయలేదు. తనతో వచ్చుచున్న మాంత్రికులు, వైద్యులు ఆమె విషబాల యనినను ఆతడు లెక్కింపలేదు. త్వరలోనే ఆమెతోడనే తన లోకమని గ్రహించిన యువరాజు ఆమెను మానవకన్యగా మార్చుటకు వైద్యులను ఆజ్ఞాపించెను. తన్ను చంపుటకే ఆమెను స్థూలతిష్యుల వారు ప్రయోగించినారిన శ్రీకృష్ణుడాశ్చర్యము నందెను. ఇట్లు విషబాలా శ్రీకృష్ణులు పరస్పరము ఆకర్షితులైరి.

ఉజ్జయిని, మాళవములలో యుద్ధము ముమ్మరముగా జరుగుతున్నది. కాని ధాన్యకటకమున ఊహింపరాని ఘోరమొకటి జరిగినది. ఒక సాయంకాలము ఉద్యానవనమున నున్న హిమబిందును చోరలెవరో తస్కరించుకొనిపోయిరి. పట్టణమంతయు అట్టుడికిపోయింది. మహారాజుకు, చారుగుప్తులకు వార్తలపంబడినవి. సువర్ణశ్రీ ఏమైనను తాను హిమబిందును కనుగొనవలెనన్న ప్రతినతో యింటినుంచి బయలుదేరినాడు.

సువర్ణశ్రీ మిత్రుడు గోండుల యువ రాజు మహాబల గోండుడు. ఆతని సాయమున హిమబిందును

కనుగొనవలెనని ఆతని తలంపు. శబరులనే దస్యులు హిమబిందును, ఆమె మాతామహి ముక్తావళీదేవిని ఈ అరణ్యాలకే తీసుకొని వచ్చినారని ఒకనాడు నర్మదా నదీ తీరాన కూర్చుని వుండగా సువర్ణశ్రీ ఒక నావను కనుగొన్నాడు. అది ఎటునుండి వచ్చినదో కనుగొనుటకు నీట దుమికినాడు. ఒక గుహాంతర్భాగాన – నీటిలోనికి చొచ్చుకుని వున్న ఒక ద్వారాన్ని సమీపించి గుహలోనికి వెళ్ళినాడు. ఎంతో చాక చక్యమును చూపి అచట బందీలైన హిమబిందు, ముక్తావళీదేవులను రక్షించినాడు సువర్ణశ్రీ. గోండు సైన్యములు ఆ గుహను ముట్టడింప అందు మహారాజకుమారుడు మంజుశ్రీకూడా సువర్ణశ్రీకి దొరికినది.

ఆనంద దాతుకములైన యీ వార్తలు మహారాజునకు, చారుగుప్తుల వారికి ఎరిగింపబడినవి. తన గురువైన సోమదుత్తుల కోరిక ననుసరించి సువర్ణశ్రీ యువరాజు శ్రీకృష్ణులకు అంగరక్షకుడై ఆతని ప్రాణములను కాపాడి యువరాజు మన్ననలను, ఉపసైన్యాధిపత్యమును గ్రహించెను.

చారుగుప్తుల వారు హిమబిందును యువరాజ్ఞి చేయుటకు, మహారాజుల అనుజ్ఞను వేడినారు. మహారాజుల అనుమతితో ఆ విషయమును శ్రీకృష్ణ సాతవాహనులకు వర్తమానమంపిరి. కాని యువరాజుల మనసంతయు విషబాల ఆక్రమించినది. అందుమరి యొకరికి చోటులేదు.

ఇన్ని వైపుల నుంచి దాడులకు తట్టుకొనలేక పాటలీపుత్రము ఆంధ్రుల వశమైనది. ఆంధ్ర సాతవాహనుడు జంబూద్వీపమును జయించి చక్రవర్తి అయినాడు. అన్ని వైపుల ఆయనకు విజయమే. ఒక్క కుమారుని వివాహ విషయమే మహారాజును కలిచి వేయుచున్నది. ఆతడు విషబాలను తప్ప మరొకరిని వివాహ మాడనని స్పష్టపరచినాడు. మహారాజు అమృతపాదార్హతుల వద్దకు పోయి యీ విషయమున ఆ బౌద్ధ గురుదేవుల సలహా నందదలిచినాడు. అమృతపాదార్హతులు విషకన్య అనన్య సామాన్యమైన అందచందములను మహారాజునకు తెలియ చెప్పి, ఆమె యువరాజునకు తగినదేనని చెప్పినాడు. అంతేకాదు హిమబిందు సువర్ణశ్రీల ప్రేమోదంతమును కూడా ఆతడు మహారాజునకు వెల్లడించినాడు. సువర్ణశ్రీ చెల్లెలైన నాగబంధునిక, సమవర్తి సాతవాహనులు ఒండొరులను ప్రేమించుకొన్నారు. మహారాజుల అనుజ్ఞతో వారి వివాహము కూడా నిశ్చయింపబడినది.

ఒకనాటి మధ్యాహ్నము విషబాల విషయమును కనుగొనుటకు అమృతపాదార్హతులు స్థౌలతిష్యుల ఆశ్రమమునకు పోయినారు. అచట వారిరువురకు బౌద్ధ వైదిక మత సూత్రములను గురించి తీవ్రమైన చర్చ జరగినది. ఈ చర్చ జరుగుచుండగా స్థౌలతిష్యులు అమృతపాదార్హతులను గుర్తించిరి, ఆ బౌద్ధభిక్షువు తన కుమారుడే! అతడు ముప్పదియవ యేట గంగా నదిలో మునిగిపోయినాడు. తన పూర్వ స్మృతిని పూర్తిగా కోల్పోయి బౌద్ధుల సంఘారామములందు పెరిగి, విద్యనార్జించి వారందరికిని నేడు గురువైనాడు. స్థౌలతిష్యుల వారు కోపము నెపమున కుమారుని తలపై తన దండెములో తీవ్రముగా గాయము నొసరించెను. కుమారుడు తండ్రిని గుర్తించెను. తన పూర్వ జన్మ మంతయు ఆతనికి జ్ఞప్తికి వచ్చినది.

ఈ మత చర్యలో అమృతపదార్హతులు ఆర్య, బౌద్ధ ధర్మములకు అతి సన్నిహిత సంబంధమున్నదని

నిరూపించినాడు. తన కొమరుడిట్లగుట, తన విషబాలికా ప్రయోగము నిరుపమోగమగుటతో – స్థాలతిష్యుల వారి జ్ఞానోదయమైనది. కుమారునితో పాటు తానును లంబికా యోగమునకు పోయినాడు. అందు బౌద్ధ ధర్మము, ఆర్య ధర్మము వేరు కాదని గ్రహించెను. "భిక్షూ! నిర్వికల్ప పథగాములమైన మేమేమి, నిర్వాణ పథగాములగు మీరేమి ఒక్కరమే!" అని ప్రకటించి విషకన్య అమృత బాలయై శ్రీకృష్ణ సాతవాహనుని వివాహమాడుటకు ఆమోదించెను.

ఇది ఎరుగని సువర్ణశ్రీ యుద్ధమున మహారాజునకు విజయము లభింపగనే తను పని నెరవేరినది అని నిశ్చయించుకుని భారతదేశములోని సంఘారామములన్నింటిని చూచి, భిక్షువై శిల్పములను చెక్కుటలోనే తన జీవిత సర్వస్వమును గడుపవెలనని నిశ్చయించుకొని బయలుదేరెను.

శ్రీ కృష్ణుడు విషబాలను వివాహమాడునని విన్న చారుగుప్తులు నిర్వణ్ణులైరి. ఆయిన ఆశలన్నీ నశించినవి. కాని తుదకాతడు తేరుకుని తన కుమార్తె ఆనందమే తన సర్వస్వమని గ్రహించి సువర్ణశ్రీ కిచ్చి ఆమె వివాహమును జరిపించుటకు ఆమోదించెను. మహారాజు ఆతనిని పాటలీపుత్రమున తమ ప్రతినిధిగా నిర్దేశించిరి.

ఇక కీర్తి గుప్తులు, శ్రీకృష్ణ సాతవాహన మహారాజుల అనుమతి ఒడసి సువర్ణశ్రీని తెచ్చుటకు, ఆతడు సన్యాసి కాకుండుటకు త్వరపడి సంఘా రామములను వెదికికొనుచు బయలుదేరిరి. వారికన్న ముందుగనే హిమబిందు తండ్రికి కూడా తెలియకుండ సువర్ణశ్రీని వెదికికొనుచు వారణాసి మృగవన సంఘారామమునకు వచ్చెను. ఆమెను చూచికూడ సువర్ణశ్రీ ఊగుచున్న తన మనసును దారిలోకి తెచ్చుకుని తాను సన్యాసి నగుదునని చెప్పెను. ఆమె సన్యాసమును స్వీకరింతుననగా "నీకు సన్యాసమేమి?" అని వారించెను.

"సువర్ణశ్రీ కుమారా! నీకు మాత్రము సన్యాసమెందుకయ్యా?" అని చారుగుప్త డామందిరిములోకి వచ్చెను.

కథ అంతయు యిట్లు సుఖాంతము.

"హిమబిందు" చారిత్రక నవల. అందుననూ తెలుగు చరిత్రకు సంబంధిచినది. శాతవాహనులు తొలి తెలుగు చక్రవర్తులు. చరిత్రను నవలకు అనువుగా మలచుటలో బాపిరాజు గారు చూపిన ప్రజ్ఞ అసాధారణమైనది. అందుకుగాను రచయిత భాషలోను పాత్రపోషణలోను ప్రత్యేకమైన శ్రద్ధ వహించినారు.

అట్టి చరిత్రకనువైన పాత్రలను సృష్టించుకొనుట, వారు వారు మాట్లాడు భాషనే ప్రయోగించుట, వారికి తగిన ఆచారవ్యవహారములను సూచించుట – ఇవి అన్నియు యీ చారిత్రక నవల యందు నిర్దిష్టముగ చూపబడినవి. మహారాజుల జన్మదినోత్సవములు, అందు జరుగు వేడుకలు, విజయోత్సవములు ఇవి అన్నియు ఆ రాచరికపు చిహ్నములే! రాజకీయ, మత, సాంఘిక, న్యాయ విషయములలో ఏ ఒక్క భాగమును బాపిరాజుగారు విడువలేదు. ఈ అన్ని విషయములను గురించిన వ్యాఖ్యానము, వర్ణన – యీ నవలలోని చారిత్రకత్వమునకు

సౌష్టవమును ఇచ్చినవి.

బాపిరాజుగారి భాష కొండ చరియలలో ప్రవహించే సెలయేరు వంటిది. ఉదాత్తమైన సంస్కృత సమాసములు, వెనువెంటనే అతి లలితమైన తేటతెలుగు పదములు. వేషభాషలు, జీవన విధానము, శౌర్య ప్రతాపముల ప్రకటన – ఇట్టి ఆనాటి వారి ప్రతిచిన్న ఆచార వ్యవహారముల పైన బాపిరాజుగారు తమ నిశ్చితమైన అభిప్రాయాలను – పరిశోధకుని వలె నిశితముగా – వెల్లడించినారు.

హిమబిందు ఇతివృత్త నిర్మాణము క్లిష్టమైనది. చరిత్ర అనగానే మత, రాజకీయముల ప్రసక్తి ఉండక తప్పదు. నిజమునకు ఆ రెండు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నవని చెప్పక తప్పదు. మతవైరములు, కుట్రలు యీ నవలలో కూడా ప్రధానములే. ఆనాటి రాజకాయములలో బౌద్ధ, వైదిక మతాను యాయులకు మధ్య జరిగు సంఘర్షణను కన్నులకు కట్టినట్లు చిత్రించినారు శ్రీ బాపిరాజు.

ఇది స్థూలతిష్యుల వారు విషబాలను రాజకీయ సంబంధమైన కార్యమునకు నిర్దిష్ట పరిచిన నాటినుంచి యీ రాజకీయముల ప్రాముఖ్యము అంతకంతకు పెరుగుతూ వచ్చి, మహారాజుల పాటలీపుత్ర విజయముతో పరాకాష్టనంది, స్థూలతిష్య, అమృతపాదార్హతుల వాగ్వివాదముతో మతములో లీనమైపోయినది. స్థూలతిష్యుల వారు వైదిక, బౌద్ధ మతములు వేరు కావని గ్రహించుట ఆ రెండు మతముల సామరస్యమునకు ఎంత ముఖ్యమో, దేశసౌభాగ్యమునకు రాజకీయముగ అంత ముఖ్యము. ఆనాటి (ఈనాటికి వలెనే) చరిత్రలో మతమే రాజకీయములకు మూలము.

ఈ చారిత్రక కథకు అనుబంధముగా నడిచినవి యిందలి ప్రేమకథలు. అందు ముఖ్యమైనది నాయిక హిమబిందు, సువర్ణ శ్రీల ప్రేమోదంతము. ఈ ప్రేమకు మొదటి నుండి అన్నియు అవాంతరములే. చారుగుప్తుల వారు కోటీశ్వరులు. ఆమెను మహారాజ్ఞి చేయుట ఆయన జీవితాశయము. సువర్ణశ్రీ సాధారణుడు. మరొక వంక ఆమె మేనత్త కుమారుడు సమవర్తి ఆమెను వివాహమాడ కోరినాడు. వారిద్దరిని కాక సువర్ణశ్రీనే హిమబిందు వరించుట, రాజ్ఞీత్వమును కూడా నిరాకరించుట – నిజమైన ప్రేమ ప్రాపంచిక సౌఖ్యములకు అతీతమైనదని నిరూపించుటయే.

హిమబిందును కనుగొని ఆమె తండ్రికి ఆమెను అప్పగించి తాను సన్యాసమును స్వీకరింప నిశ్చయించి తన ప్రేమను త్యాగము చేయుటకెచ్చగించిన సువర్ణ శ్రీ ప్రేమ ఎంత త్యాగమయమైనదో, తాను కోరిన వరుని వివాహమాడుట కనుకూలింపక పోవుటతో ఆ ప్రేమికునితో పాటు తానును సన్యాసమును స్వీకరించుటకు నిశ్చయించుకొనిన హిమబిందు మనోధైర్యము కూడా అంత బలవత్తరమైనదే!

అందువల్లనే ఉదాత్తమైన ప్రేమ ప్రాపంచికమైన ఆటంకములకు అతీతమైన దన్న సూచనతో నవల ముగిసినది. దీని యందలి మరొక ప్రేమకథ శ్రీకృష్ణ సాతవాహన, విషబాలలది. హిమబిందు సువర్ణశ్రీల

ప్రేమ కళాత్మకమైన ఉదాత్త ప్రేమ. అట్లే విషమును మధించి, అమృతమును సాధించిన శ్రీకృష్ణవిషబాలల ప్రేమ కూడా దివ్యమైనది. ఆ ప్రేమలు రెండును పట్టుదలతో తమ ఆస్తికతను నిరూపించుకొన్నవే.

పాత్రపోషణ విషయములో బాపిరాజు గారి మీద ఒక అపప్రధ ఉన్నది – ఆయన పాత్రలన్నియు ఉదాత్తముగాను, సర్వలక్షణ సముపేతముగాను ఉంటవి – అని. ఆయన నవలలలోని నాయకులందరూ సమున్నత దీర్ఘులు. వీరులు. సుశిక్షితులు. సర్వకళామయమూర్తులు. ఒక స్త్రీలు సౌందర్యఖనులు, సర్వకళాశోభితలు, సర్వవిద్యా పరిపూర్ణలు. ఇట్టి పాత్రలు నిత్య జీవితములో మన అనుభవములకు విరుద్ధముగా వుంటవి.

కాని యీ విధమైన బాపిరాజుగారి పాత్రపోషణకు రెండు రకముల సమాధానము చెప్పుకొనవచ్చు. ఒక విధముగా యీ పాత్రలు ఆయన మనోభావములకు ప్రతిబింబములు. ఆయనవెనే ఆయన పాత్రలు కూడా జీవితములోని మంచికి మాత్రమే ప్రాతినిధ్యము వహిస్తాయి. జీవితంలో కాపట్యము ఎరుగని వాడు అగుట వల్లనే తుదకు స్థూలతిష్యుల వారిలో కూడా మానసికమైన మార్పును సూచించి దివ్యునిగా చేసినాడు బాపిరాజుగారు.

ఇందులకు మరియొక కారణము బాపిరాజుగారికి చరిత్రను గురించి ఉన్న అభిప్రాయములు. తెలుగువారి చరిత్రలను తెలుగువారు చదువుట ఒక విధముమగా వారి ప్రాచీనులను గూర్చి వారి ఉన్నతిని గురించి తెలిసకొనుట. వారిని శీలహీనులనుగా చిత్రించినచో యీ తరముల వారికది మార్గదర్శకము కాదు. ఈ చారిత్రక దృష్టి ఆయనచే అంతటి ఉదాత్తమైన పాత్రలను సృష్టింపచేసినది.

అందువలననే ఆంధ్ర సాతవాహన రాజవంశమువారిలో నేమి, వారి దండనాయక సేనాపతుల లోనేమి, వారి ప్రజలోనేమి మనకీ ఉదాత్త మైన వ్యక్తిత్వమే గోచరించును. కాని బాపిరాజుగారు ఈ ఏకత్వములో సున్నితమైన భిన్నత్వమును కూడా చూపలేకపోలేదు. అందుకు నిదర్శనముగ యీ నవల యందెన్ని పాత్రలనైనా చూపవచ్చును. సమదర్శీ సువర్ణశ్రీ; విషబాలా హిమబిందులు; చారుగుప్త శ్రీముఖసాతవాహనులు అన్నింటిని మించి స్థూలతిష్య అమృతపాదార్హతులు.

స్థూలతిష్యుల వారి పాత్ర వైవిధ్యమైనది. ఈయనలో ఆర్యుల వైదిక నిష్టను, కార్యదీక్షను, మనో నైశిత్యాన్ని కన్నులకు కట్టినట్లు చిత్రించారు రచయిత. ఈయనలోని మార్పు కథకు అత్యంత ప్రాముఖ్యము. “ఆర్య ధర్మావతారమే బుద్ధుడు”ని ఆయన వచించుట రెండు మతములను సమన్వయించు రచయిత చేసిన వ్యాఖ్యానము.

స్థూలతిష్యుల చరిత్రలో ముఖ్యమైనది విషబాలికా ప్రయోగము. ఈ అంశమును బాపిరాజుగారు చాణక్య, చంద్రగుప్తుల కథనుండి గ్రహించినాడనుట స్పష్టము. కాని చాణక్యుల వారి విషకన్య విషకన్యగానే వుండిపోయి వారి కార్యములను విజయవంతంగా నిర్వహిస్తుంది. బాపిరాజు గారి విషకన్య అంతకన్న క్లిష్టమైన పాత్ర.

శారీరక, మానసిక సంఘర్షణలో మానసికమైన శక్తికే విజయమని ఆమె నిరూపించింది. ఆమెను శారీరకముగా విషతుల్యము చేసినారు మహర్షి. ఆమెగాలి సోకిన మరణమే శరణ్యము. కాని ఆమె మనసు వెన్నముద్ద ఆమె మానసికముగా అమృతమూర్తియే. స్థౌలతిష్యులవారి మనసులో నున్న విషభావమును ఆమె ప్రతీక కదా! ఆ భావములను కూడా విరిచి ఆతనిని మార్చుటయే ఆమె శక్తికి నిదర్శనము. స్థౌలతిష్యులు ఆమెను శ్రీకృష్ణున కిచ్చి వివాహమొనరించుట ఆమోదించుట యీ మార్పునే సూచించును.

స్థౌలతిష్యమహర్షి కుమారులైన అమృత పాదార్హతుల పాత్ర ముఖ్యంగా ప్రతీకాత్మకంగా (.....) చిత్రించబడినది.....పుత్రభావం అతి సున్నితము, మార్దవమూ అయినది. మానవుడు కాఠిన్యము, మృదుత్వమూ సమంగా పెంచుకున్న మూర్తి. కుమారుడు తనతో ఉన్నతం కాలము స్థౌలతిష్యులు సౌమ్యమూర్తి. కుమారుడు గంగలో కలిసిపోయిన నాటినుంచి అతడు కాఠిన్యమూర్తి. ఎంతటి కాఠిన్యమూర్తి కాకున్న మనమరాలిని విషకన్యగా చేయ సమకట్టినాడు! తన పుత్రుని గుర్తించి వెనుక యీ కాఠిన్యమూర్తియే పరమ మార్దవ మూర్తిగా మారిపోవుట మనము గమనించ వలయును. ఈ సౌమ్యభావము ఆయనలో కలుగగానే ఆయన వెనుకటి స్థౌల తిష్యులే అయినారు. వైదిక, బౌద్ధ మతముల సారూప్యమును గ్రహించినాడు.

ఇచట మరియొక విషయమును కూడా వివరింపవలసి ఉన్నది. వైదికులైన స్థౌలతిష్యులకు బౌద్ధులకు బౌద్ధులైన అమృత పాదార్హతులు కుమారులగుటలో బాపిరాజుగారు మత సంబంధమైన ఒక క్రొత్త భావమును స్పష్టము చేసినారు. ఆ తండ్రి కొమరులకు గల జనకజన్య సంబంధమే వైదిక, బౌద్ధ మతములకును కలదని యందలి తాత్పర్యము.

ఈ నవల యందు ముఖ్యమైనది వైదిక, బౌద్ధ మతముల సారూప్య నిరూపణము. ఇది మరి ఏ తెలుగు రచయిత కూడా చేయనిది. ఇది యీ నవలలో అత్యద్భుతముగా చూపబడినది. స్థౌలతిష్య, అమృత పాదార్హతుల కథలో మరియొక ప్రతీక కూడా చదువరులకు స్ఫురించును. తండ్రి నుండి కుమారుడు దూరమగుట, వేరు మార్గమున పెంచబడుట, తుదకు తండ్రిని కనుగొనుట – ఇవి అన్నియు బౌద్ధ మతమునకు కూడ వర్తిల్లును. నిజమునకు వారి కథ భారతదేశమున బౌద్ధమతము యొక్క చరిత్రకు కథారూపమని చెప్పవచ్చును.

ముఖ్యముగా అమృత పాదార్హతులు స్థౌలతిష్యుల వారిని చూచుటకు పోయిన నాటినుండి, తిరిగి ఆయన వద్ద సెలవు తీసుకొని పోవుట వరకు కథ అత్యంత రమణీయముగా నడచినది. ఇది చరిత్ర కొక నూతనర్థమును స్ఫురితం చేయుట అనవచ్చును.

హిమబిందు నవల యందలి సంఘటనలు ఆంధ్రదేశమున బౌద్ధ మతము ఉచ్ఛదశయందున్న నాటివి. సాతవాహనులు బౌద్ధులు. కాని వారు సర్వమతములను సమానముగా ఆదరించిరి. అయినను అతి వాదులైన వైదికులు బౌద్ధమతమును నిరసించి మహారాజులను కూలద్రోసి, రాజ్యము రక్షణకే ముప్పు తెచ్చుటకు ప్రయత్నించుట చారిత్రక సత్యము. ఈ బౌద్ధ వైదికమతముల సంఘర్షణము యీన వలయందు అత్యుత్తముగా

చిత్రింపబడినది. ఇందులకు పరాకాష్ట స్థౌలతిష్యుల వారు రెండు మతముల యందలి సారూప్యమును గ్రహించుటయే! ఈ నవల యందు బాపిరాజుగారు స్థాపింపదలుచుకొన్న సర్వమత సామరస్యమును (ముఖ్యంగా ఆనాటి రెండు మతములు) అమృత పాదార్వతుల అమృతోపమానమైన వాక్కునుండి జనించినవి:

> "ఆర్య ధర్మమే వేదములు. ఆర్య ధర్మావతారమే బుద్ధుడు. జనక రాజర్షికి బిమ్మట శ్రీకృష్ణవతారము వేదవ్యాసుల పరిణతియే బుద్ధావతారము"

ఈ నవల యందు బాపిరాజుగారి సర్వవ్యక్తిత్వము ప్రదర్శింపబడినది. సువర్ణశ్రీ బాపిరాజుగారి ఆశయముల ప్రోవు. కేవలము పాత్రల యందే కాక నవలయందంతటను బాపిరాజుగారు ఎన్నో విషయములను స్పృశించి, చర్చించిరి. ఆనాటి సైన్య విభాగమును గూర్చి ఒక అధ్యాయము వ్రాయబడినది. రాజమార్గములను గురించిన ప్రసక్తి, వైద్య విధానమును గురించి, యోధాగారములను గూర్చి నగర వీధుల నిర్మాణములను గురించి, న్యాయవిచారణమును గురించి – బాపిరాజుగారు సుదీర్ఘమైన విచారణ చేసినారు. ఇవి అన్నియు ఆయన పాండిత్యమునకు, నిశితమైన పరిశీలనకు ఉదాహరణలు.

ఈ విధముగా "హిమబిందు" తెలుగు సాహిత్యంలోని ఉత్తమమైన నవలలో ఒకటి. తెలుగు చరిత్రను ఇంత హృదయంగమంగా చిత్రించిన బాపిరాజుగారు ధన్యులు.